ట్రాఫిక్ ఉల్లంఘనులు

- కఠినంగా రహదారి నిబంధనల అమలు
- ఏడాదిలో 75 వేల కేసుల నమోదు
- రూ.3.7 కోట్ల జరిమానా.. 170 వాహనాల సీజ్
- త్రీ టౌన్ పీఎస్ పరిధిలో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్‌లు
- వాహన చోదకుల్లో కానరాని మార్పు



సిరిపురంలో సైన్ బోర్డు ఏర్పాటు చేస్తున్న సీఐ అమ్మినాయుడు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు

బీచ్‌రోడ్డు: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. రహదారి నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నారు. అయినా సరే పలువురు వాహన చోదకుల్లో మార్పు రావడం లేదు. రోడ్డు ప్రమాదాలు, వాటి ద్వారా సంభవించే మరణాలు ఆగడం లేదు. అన్ని రకాల మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృతి చెందుతున్నారని, వాటిని అరికట్టాలని ఆలోచనతో వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కొరడా ఝులిపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వారికి వేస్తున్న జరిమానాలు నడ్డివిరుగుతున్నాయి. ఇప్పటి వరకు హెల్మెట్ ధారణ విషయంలో కూడా ఆచితూచి ఉండేవారు. ఈ ఉల్లంఘనల విషయాల్లో కొన్ని నెలలుగా ట్రాఫిక్ పోలీసులు పట్టుబిగించారు. గత ఏడాది కాలంగా మూడో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 75 వేల కేసులు నమోదు కాగా.. వాటిలో అత్యధికంగా హెల్మెట్ లేనివే ఉన్నాయి. దాని తరువాతి స్థానం డ్రైవింగ్ లేకుండా వాహనం నడిపిన కేసులవి. వీటి నమోదు ద్వారా వాహన చోదకులపై రూ.3.7 కోట్లు జరిమానా విధించారు.

అత్యధికంగా హెల్మెట్ లేని కేసులే..

రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా హెల్మెట్ లేక పోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయి. దీంతో కచ్చితంగా వాహన చోదకులతోపాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ పెట్టుకోవాలని ట్రాఫిక్ అధికారులు నిబంధనలు జారీ చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో అత్యధికంగా హెల్మెట్ లేనివే ఉన్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ జరిమానా ఎక్కువే..

మద్యం తాగి వాహనం నడిపి చెల్లించిన జరిమానా ఎక్కువగానే ఉంది. డ్రంక్ అండ్ డ్రైవ్ ద్వారా గతేడాది కాలంగా నమోదు చేసిన కేసుల ద్వారా రూ.70 లక్షల జరిమానాను పోలీసులు విధించారు. మొత్తం ట్రాఫిక్ కేసుల జరిమానా రూ.3.7 కోట్లు కాగా.. అందులో అత్యధికంగా మద్యం కేసులదే. ఈ ఏడాది కాలంలో మొత్తంగా 2 వేల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సిరిపురం, బీచ్ రోడ్డు పార్కు హోటల్ కూడలి వద్ద ప్రాంతాల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగిస్తున్నారు.



సీజ్ చేసిన వాహనాలు

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్

ట్రాఫిక్ నిబంధనలు పాటించని కేసుల నమోదులో రెండో స్థానంలో డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులున్నాయి. గడిచిన ఏడాది కాలంగా సుమారు 2,600 కేసులు నమోదు చేశారు.

170 వాహనాలు సీజ్.. జరిమానా

గత ఏడాది కాలంగా నిర్వహించిన తనిఖీల్లో 170 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. వాటిలో ఎక్కువగా ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, అధిక శబ్దం ఇచ్చే వాహనాలు, ఎటువంటి పత్రాలు లేని వాహనాలు ఉన్నాయి. గడిచిన మూడు నెలల్లోనే ర్యాష్ డ్రైవింగ్ కేసుల్లో 70 వాహనాలను సీజ్ చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువత కోసం రాత్రి 12 నుంచి వేకువజాము 3 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌లో దొరికితే వాహనాలు సీజ్‌చేసి కోర్టుకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు జరిమానాతోపాటు 15 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది.

మే 2024 నుంచి మే 2025 వరకు నమోదైన కేసుల వివరాలు

హెల్మెట్	29,660
డ్రైవింగ్ లైసెన్స్	2,601
డ్రంక్ అండ్ డ్రైవ్	1,903
ప్రమాదాలు	63
ర్యాష్ డ్రైవింగ్	75
శబ్ద కాలుష్యం	24
మైనర్ డ్రైవింగ్	16
సీజ్డ్ వాహనాలు	170



త్రీ టౌన్ పోలీస్ స్టేషన్

అవగాహన కార్యక్రమాలు

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధిక శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్లపై మెకానిక్‌లకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు దగ్గరలోని ఆస్పత్రులను సూచించే సైన్ బోర్డులను ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించి.. సురక్షిత ప్రయాణం సాగించాలని వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.



రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

యోగాంధ్రకు ఆరిలోవ నుంచి 1,000 మంది విద్యార్థులు



ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ఆరిలోవ ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 1,000 మంది విద్యార్థులను తరలించనున్నారు. ప్రతి 50 మందికి ఒక బస్ చొప్పున శుక్రవారం సాయంత్రమే సిద్ధం చేశారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల నుంచి 200 మంది, శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ నుంచి 150 మంది విద్యార్థులతోపాటు పలు ప్రైవేట్ స్కూళ్ల నుంచి మరో 650 మంది విద్యార్థులు యోగాంధ్రకు సిద్ధమయ్యారు. వీరంతా శనివారం వేకువజాము 4.30 గంటలకే వారి పాఠశాలలకు చేరుకునేటట్లు సమాచారం పంపించారు. అక్కడి నుంచి బస్‌ల్లో వారికి కేటాయించిన స్థలాలకు తరలించనున్నారు. విశాలాక్షినగర్, ఆరిలోవ ఆదర్శనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల నుంచి డ్వాక్రా సంఘాల మహిళలు, పలు కాలనీల వాసులను వేల సంఖ్యలో సచివాలయాల సిబ్బంది తరలించనున్నారు.

జూనియర్ కళాశాలల నుంచి 12 వేల మంది విద్యార్థులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 12,800 మంది విద్యార్థులు 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్ తెలిపారు. వీరిని తరలించడానికి 238 బస్సులు కేటాయించారు. ప్రతి బస్సుకు ఒక జూనియర్ లెక్చరర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే 19 మంది ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌లను నోడల్ అధికారులుగా నియమించారు. 88 బస్సులలో 4,466 మంది ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్‌లో జరిగే 'యోగాంధ్ర' కార్యక్రమంలో 4 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు. వీరికి 7 గురు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. మిగిలిన 150 బస్సులలో 8,352 మంది విద్యార్థులు గీతం మెడికల్ వద్దకు చేరుకుని 6 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు. వీరికి 12 మంది ప్రిన్సిపాల్‌లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. నోడల్ అధికారులు, లెక్చరర్ ఇన్‌చార్జులు విద్యార్థులను వారి కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు చేర్చడం, తిరిగి బస్సుల వద్దకు తీసుకురావడం వంటి బాధ్యతలు చూసుకుంటారు.

క్లుప్తంగా

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరినగర్‌లోని విఘ్నేశ్వర అభయాంజనేయ దత్తాత్రేయ సహిత షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో షిర్డీసాయి విగ్రహాన్ని పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. స్థానికులతోపాటు నెహ్రూనగర్, దుర్గానగర్, టీపీసీ పాయింట్ నుంచి భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు సాయిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హామీలు నెరవేర్చాలని ర్యాలీ



'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' బ్యానర్, పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్సార్ నగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో బ్యానర్ పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారంటూ నినాదాలు చేశారు. సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు సత్యాల వెంకట్, సత్యాల సాగరిక, వనం వరలక్ష్మి, కె.సుబ్బారావు, హిజ్రా సత్యనారాయణ, ప్రసంగి వాసు, కాకర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గ సమస్యలు పరిష్కరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. బీచ్ రోడ్డులోని ఒక సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన వెలమ నాయకులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షలకు పైగా వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్నారని, వీరికి ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెలమను బీసీ–డీ నుంచి బీసీ–ఏకి మార్చాలనే డిమాండ్‌ను పరిశీలించాలని కోరారు. జన గణనతో పాటు కుల గణన చేయాలనే కేంద్ర నిర్ణయాన్ని తాము స్వాగతిస్తామన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడం నాయుడు, గంగు మన్మధరావు, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటీన్ ఫుడ్‌తో ఆరోగ్యం



చికెన్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన వంటకాలు

బీచ్‌రోడ్డు: ప్రోటీన్ ఫుడ్‌తో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని, చికెన్ ద్వారా అత్యధిక ప్రోటీన్లు లభిస్తాయని బార్బిక్యూ నేషన్ ఏపీ ఆపరేషనల్ హెడ్ నరేష్ నాయుడు ముత్తులూరు అన్నారు. సిరిపురంలోని బార్బిక్యూ నేషన్‌లో శుక్రవారం చికెన్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ శరీరానికి బలాన్నిస్తుందన్నారు. ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన చికెన్ వంటకాలు నోరూరిస్తాయని తెలిపారు. వినియోగదారులకు విభిన్నమైన వంటకాలతో చికెన్ విందును అందించనున్నామన్నారు. నాన్ వెజ్ ప్రియుల కోసం ఈ మేళా ప్రారంభించినట్లు చెప్పారు. చికెన్ మరగ్ సూప్‌తో సహా రుచికరమైన స్టార్టర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నిరుద్యోగ భృతి వంచనపై 'యువత పోరు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, యువకులు

మద్దిలపాలెం: ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని వంచించిన కూటమి ప్రభుత్వంపై యువత పోరుకు సిద్ధమయ్యారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరు కార్యక్రమం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకుటి చందు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోరులో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనేలా చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జిల్లా వలంటీర్ విభాగ అధ్యక్షుడు పీలా ప్రేమ్, యువకులు పాల్గొన్నారు.

విద్యార్హత సడలింపుపై ఏపీసీఆర్ఏఎఫ్ హర్షం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో విద్యార్హతను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ చైల్డ్ రైట్స్ అవేర్నస్ ఫోరం (ఏపీసీఆర్ఏఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణా త్రినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా పదవులకు పీజీని విద్యార్హతగా పేర్కొందని తెలిపారు. కమిషన్ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించిందంటూ ఫోరం దుయ్యబట్టిందని చెప్పారు. నోటిఫికేషన్‌లో విద్యార్హతను మార్చాలంటూ ప్రభుత్వానికి లేఖ రాయడంతోపాటు న్యాయపరంగాను పోరాడామన్నారు. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో పీజీగా ప్రకటించిన విద్యార్హతను డిగ్రీకి కుదిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇది ఏపీసీఆర్ఏఎఫ్, రాష్ట్ర బాలల విజయంగా వారు పేర్కొన్నారు. ఈ నియామకాల్లో చట్టాల్లో సైతం విద్యార్హత ఎక్కడా పేర్కొని లేదన్నారు. వివిధ రూపాల్లో 10 ఏళ్లు బాలలకు చేసిన సేవా కార్యక్రమాలను ప్రామాణికంగా గతంలో ఆయా పదవుల్లో నియామకాలు జరిగేవన్నారు. డిగ్రీ విద్యార్హతను సైతం తొలగించి గతంలో మాదిరిగా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్

మహారాణిపేట: బీచ్ రోడ్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్లు, ఎల్ఈడీ స్క్రీన్, సౌండ్ సిస్టమ్‌లను ఆయన పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా, సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ పర్యటనలో వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని సుమారు లక్షా యాభై వేల ప్రదేశాల్లో శనివారం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని యోగాంధ్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు.

స్తంభాలకే పరిమితమైన కైలాసగిరి వ్యూ పాయింట్



హైవే వైపు కైలాసగిరి వ్యూ పాయింట్ వద్ద షెల్టర్ లేని స్తంభాలు

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కై లాసగిరిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మధ్యంతరంగా నిలిచిపోతున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు ఇక్కడ అభివృద్ధి పనులు ప్రారంభించి ఆగమేఘాలపై చేపడుతున్నారు. కొద్ది రోజులకే ఏవో కారణలతో వాటికి బ్రేక్ వేస్తున్నారు. అధికారులు ఇటీవల కైలాసగిరిపై జాతీయ రహదారి వైపు వ్యూ పాయింట్ నిర్మించదలిచారు. ఇందులో భాగంగా రహదారి అంచున కొండపై భాగంలో స్తంభాలు వేశారు. దానిపై శ్లాబ్ వేయకుండా వదిలేశారు. ఇక్కడ సుమారు 200 చదరపు గజాల విస్తీర్ణంలో వ్యూ పాయింట్ నిర్మించి అందులో సందర్శకులు కూర్చోడానికి వీలుగా సౌకర్యాలు కల్పించదలిచారు. సుమారు 10 నెలల కిందట స్తంభాలు నిర్మించి దానిపై శ్లాబ్ వేయకుండా వదిలేయడంతో వ్యూ పాయింట్ నిర్మాణానికి బ్రేక్ పడింది. ఇది సిద్ధమైతే రెండు కొండల మధ్య జాతీయ రహదారితో పాటు ఓ పక్క వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాలు, మరోపక్క హనుమంతవాక, డెయిరీఫారం, విమ్స్, హెల్త్‌సిటీ, ఆరిలోవ ప్రాంతాలను సందర్శకులు కొండపై నుంచి చూడవచ్చు. ఇక్కడ వ్యూ పాయింట్ నిర్మాణం పూర్తి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఎట్టకేలకు మత్స్యదర్శినికి మోక్షం



కొత్త రంగులు అద్దుకున్న మత్స్యదర్శిని

ఏయూక్యాంపస్: ఎట్టకేలకు బీచ్ రోడ్డులోని మత్స్యదర్శినికి మోక్షం లభించింది. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఆర్.కె.బీచ్ పరిసరాలను అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగా ఆర్.కె.బీచ్ సమీపంలోని మత్స్యదర్శినికి రంగులు వేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. చాలా కాలంగా ఇది కళావిహీనంగా దర్శనమిస్తోంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో మత్స్యదర్శిని రంగులు అద్దుకుని కళాత్మకంగా కనిపిస్తోంది. పర్యాటకులు అధికంగా సందర్శించే ఈ ప్రాంతం ఆకట్టుకునే విధంగా ఉండాలి. ఎట్టకేలకు అధికారులు దీనిపై దృష్టి సారించి, మత్స్యదర్శిని భవనం, ప్రహరీకి రంగులు వేస్తున్నారు. గ్లోసైన్ బోర్డును సైతం మార్చారు. మత్స్యదర్శిని లోపల సైతం కొంత మార్పులు చేసి, కొత్త రకం చేపలను ఉంచితే మరింత ఆకట్టుకుంటుంది. మత్స్యదర్శిని పర్యాటకులు, చిన్నారులను అలరించడమే కాకుండా ఆదాయాన్ని కూడా అందిస్తుంది.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి



విశాలాక్షినగర్ సీఆర్‌పీఎఫ్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: నాషాముక్త్ భారత్ పఖ్వాడా ఆధ్వర్యంలో శుక్రవారం విశాలాక్షినగర్‌లోని సీఆర్‌పీఎఫ్ 198 బి.ఎన్.కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండ్–198 బి.ఎన్.మహ్మద్ రాజి ఇక్కడి సిబ్బందితో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా గురించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. నాషా ముక్త్ భారత్ పఖ్వాడా గురించి అందరూ ఐక్యతతో సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్–198 బి.ఎన్.డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, సుబేదార్ మేజర్ వంజీవ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్, మినిస్టీరియల్ ఇన్‌స్పెక్టర్ షర్మిలా శర్మ, సబ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ సింగ్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో యోగాంధ్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తరుణంలో ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేస్తూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కోరారు. అకడమిక్ సెనేట్ మందిరంలో అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కళాశాలల వారీగా ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు, వారికి ఏ కంపార్ట్‌మెంట్లను కేటాయించారు, వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల వివరాలు, సమన్వయ అధికారుల ఫోన్ నంబర్లు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సమన్వయం చేస్తూ సకాలంలో యోగాంధ్రలో పాల్గొనడంతోపాటు ప్రతి విద్యార్థి కార్యక్రమంలో అనుసరించాల్సిన విధివిధానాలను ముందుగానే వివరించాలని సూచించారు. విద్యార్థి వచ్చిన సమయం నుంచి కార్యక్రమం ముగించుకుని ఇంటికి వెళ్లే వరకు ప్రిన్సిపాల్ వారి బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈవెంట్‌లో ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తూ, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని వీసీ సూచించారు. విశ్వవిద్యాలయ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా ప్రతి విద్యార్థి నడుచుకోవాలని, ప్రిన్సిపాళ్లు సహకరించాలని కోరారు.

తోటగరువు హైస్కూల్‌లో యోగాసనాలపై తర్ఫీదు



తోటగరువు జెడ్పీ హైస్కూల్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలో యోగాంధ్ర కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి విద్యార్థులను తరలించనున్నారు. ఇందులో భాగంగా తోటగరువు హైస్కూల్ నుంచి 200 మంది విద్యార్థులు యోగాంధ్రలో పాల్గొంటారు. వారిందరికీ రెండు రోజులుగా పాఠశాల ఆవరణలో శిక్షణ ఇస్తున్నారు. 200 మంది విద్యార్థులచే సూర్య నమస్కారాలు తదితర ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గాభవాని, శిక్షకులు, పీఈటీలు పాల్గొన్నారు.